# విద్యాధనం

*"చిన్నా ... లే అమ్మా ... ఆలస్యమైపోతోంది."*

*కలత నిద్రలో ఉన్న ఎనిమిదేళ్ల రాంబాబుకి తల్లి మాటలు ఎక్కడో నూతిలోంచి వస్తున్నట్లు వినబడ్డాయి కాని మెలకువ రాలేదు. వాడు కళ్లు తెరవడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆలిచిప్పల్లాంటి వాడి కనురెప్పలు కొద్దిగా కదిలాయి కాని, నిద్రమత్తు మళ్లీ వాణ్ణి ముంచేసింది.*

"లే ... లే... ఆరుంపావైంది" - మరో పదిహేను నిమిషాల తరువాత తండ్రి గొంతు కర్కశంగా వినిపించగానే వాడు ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు. మంచం పక్కనే నిలబడి, రేజరుతో గడ్డం గీసుకుంటూ చికాగ్గా అరిచాడు ప్రభాకర్ - "రోజూ ఇదో న్యూసెన్స్ ... గంటసేపు నిన్ను లేపడానికి మాకు టైము లేదు .. లే ... లే..."

రాంబాబు ఒళ్లు విరుచుకుని కాళ్లూ చేతులూ కదిలించాడు కాని, లేద్దామని ఎంతో ప్రయత్నించినా సీసంలా బరువెక్కిన శరీరం వాడి స్వాధీనంలోకి వెంటనే రాలేదు. కళ్లు మళ్లీ మూసుకుపోతుంటే, "లే" అని తండ్రి కేక ఇంకా గట్టిగా వినిపించింది. ఆ అరుపు వింటూనే విమల పరిగెట్టుకొచ్చి, వాడిని ఎత్తుకుని మంచంమీంచి దింపి, వాష్‌బేసిన్ ముందర నిలబెట్టి బ్రష్ అందించింది.

"వాడు కడుక్కుంటాడులే - నువ్వెళ్లి బాగ్ సర్దు. వద్దు, బాగ్ నే సర్దుతాను - నువ్వు లంచ్ బాక్సు, వాటరు బాటిలు, అన్నీ సిద్ధం చెయ్యి" అన్నాడు ప్రభాకర్.

మొహం కడుక్కుని టేబులు ముందు కూర్చున్న రాంబాబు చేతికి రెండు బ్రెడ్ స్లయిసులూ, పాలూ అందించింది విమల.

"నాకు ఆకలిగా లేదమ్మా! బ్రెడ్డొద్దు, పాలు తాగుతా!" ఎనిమిది గంటల నిద్ర తరువాత శరీరం వాడితో ఇంకా సహకరించటం లేదు. నిద్రమత్తూ, నీరసం ఇంకా వదల్లేదు. వాడికి మళ్లీ పడుకోవాలనుంది కాని, ఏమీ తినాలని లేదు.

"ఆకలి లేదంటే ఎలా? మళ్లీ స్కూలుకు వెళ్లగానే ఆకలేస్తుంది. లంచ్ పీరియడ్ దాకా ఎలా ఉంటావు? పెంకితనం చెయ్యక త్వరగా తిను!" అంది విమల.

గడియారంతో పాటు పరిగెట్టడం రాంబాబుకి ఇంకా అలవాటు కాలేదు. వాడు కాళ్లూపుతూ కిటికీలోంచి బయటికి చూస్తూ తాపీగా పాలు తాగుతూంటే "ఏవిటి చిన్నా, అలా అరగంట చేస్తావు - త్వరగా తాగు - అవతల స్కూలుకి టైమవుతోంది," అని తొందర పెట్టి దగ్గరుండి తాగించింది విమల.

స్కూలు డ్రెస్సూ, బూట్లూ వేసి, టై మెడకి తగిలించి, తల దువ్వి, పౌడరు రాస్తూ రోజూలాగే జాగ్రత్తలు చెప్పసాగింది విమల - "చిన్నా! ముందు గది తాళం చెవి బాగ్‌లో ఉంది - జాగ్రత్త, పడెయ్యకు. టేబులు మీద టిఫినూ, ఫ్లాస్కులో పాలూ పెట్టి వెళతాను. స్కూలు నుంచి వచ్చాక కాళ్లూ, చేతులూ కడుక్కుని, బట్టలు మార్చుకుని టిఫిను తిని, పాలు తాగు. హోం వర్కు చేసుకో! ఈలోగా నేనూ, నాన్నగారూ ఆఫీసునుంచి వచ్చేస్తాం ..."

"సరే" అని, డ్రెస్సూ, బూట్లూ అన్నీ వెయ్యడం అయిన తరువాత ఇబ్బందిగా కదులుతూ అన్నాడు రాంబాబు -

"అమ్మా! అమ్మా!"

"ఏవిట్రా.."

వాడు కుడి చేతి రెండు వేళ్లూ చూపించబోతుండగా ప్రభాకర్ అరుపు వీధిలోంచి వినిపించింది. - "స్కూలు బస్సు వచ్చే టై మవుతోంది - ఇంకా ఏవిటి ఆలస్యం?"

"అయిపోయింది," అని ప్రభాకర్‌కి సమాధానం చెప్పి, రాంబాబు కేసి తిరిగి - "ఏవిట్రా! తొందరగా చెప్పు - అవతల టైమైపోతోంది!" అంది విమల అసహనంగా.

"ఏం లేదులే," అన్నాడు రాంబాబు కంగారుగా చెయ్యి కిందికి దింపేస్తూ.

"ఏం లేకపోతే బాగ్ తీసుకుని నడు."

రాంబాబు బాగ్ తీసుకుని బయటకు పరిగెట్టాడు. ప్రభాకర్ అప్పటికే స్కూటరుకి కిక్కిచ్చి బర్రు బర్రు మనిపిస్తున్నాడు విసుగ్గా. రాంబాబు

ముందు నిలబడగానే స్టార్టు చేశాడు. బస్సు స్టాపు చేరారో లేదే స్కూలు బస్సు రానే వచ్చింది.

"రాంబాబూ! ఇంకా పెంద్రాళే లేవాలి రేపట్నుంచీ - తెలిసిందా? కొద్దిలో స్కూలు బస్సు మిస్సయిపోయేవాళ్ళం," అన్నాడు ప్రభాకర్.

"సరే" అని తల ఊపి, తండ్రికి టాటా చెప్పి, బస్సు ఎక్కాడు రాంబాబు...

వాడు స్కూలునుంచి ఇంటికి తిరిగివచ్చేటప్పటికి రెండైంది. లోపలికి వస్తూనే పుస్తకాల సంచీ, వాటరు బాటిలూ చెరో మూలా విసిరేశాడు. బూట్లు విప్పి అటూ ఇటూ తన్ని సోఫాలో పడుకున్నాడు కాసేపు. తరువాత కాళ్లూ చేతులూ కడుక్కుంటూ వాష్ బేసిన్ ముందర నిలబడి అద్దంలో తన మొహం చూసుకున్నాడు. వాడి ఎడం చెంప ఎర్రగా కందిపోయి ఉంది. దానిమీద టీచరు వేళ్లగుర్తులు కనిపిస్తోనే వున్నాయి.

క్లాసులో టీచరు ఆ రోజు ప్రోగ్రెస్ కార్డు ఇచ్చింది. వాడికి ఆఖరు రేంకు వచ్చింది. అది ఒక కారణం. టీచరు ప్రాజెక్టు వర్కు - తాజ్‌మహల్ బొమ్మ రంగు అద్దాలు అంటించి - తీసుకురమ్మంది.

వాడు తల్లితో చెప్పాడు కాని, తల్లి "నాకు తీరికలేదు. తరువాత చూద్దాం" అంది. అందుచేత వాడు ప్రాజెక్టు వర్కు చెయ్యలేదు. అది రెండో కారణం. ఈ రెండు కారణాలవలన టీచరుకి కోపం వచ్చి చెంప పగలగొట్టి, బల్లమీద రెండు పీరియడ్లు నిలబెట్టింది. టీచరుని చంపేయాలన్నంత కోపం వచ్చింది వాడికి. కాని ఏమీ అనలేని నిస్సహాయ స్థితిలో ఆ అవమానం భరిస్తూ అలాగే నిలబడ్డాడు రెండు పీరియడ్లు.

"నేను రేపట్నుంచీ స్కూలుకి వెళ్లను. హాయిగా ఇంట్లోనే ఉంటా," అనుకున్నాడు మనసులో. ఇల్లు అనగానే తండ్రి గుర్తుకు వచ్చాడు రాంబాబుకి. నాన్నకి ప్రోగ్రెస్ కార్డు చూపించాలి. ర్యాంకు తక్కువ వచ్చిందని నాన్నకి కోపం వస్తుంది. నాన్నకి అసలే చాలా కోపం. నాన్న ఏవడుగుతాడో, ఏం చెప్పాలో అని వాడికి భయం భయంగా వుంది.

ఈ సారి నాన్న తిడితే ఇంట్లోంచి పారిపోతాను. ఎక్కడికి పారిపోతాను? ఎక్కడుంటాను? అన్నం ఎవరు పెడతారు?

స్కూలుకి వెళ్లాలంటే భయం, ఇంటికి వెళ్లాలంటే భయం - వాడికి ఏడుపొచ్చింది. ఏడుస్తూనే హోంవర్కు చెయ్యడానికి పుస్తకాలు తీశాడు.

THE PLANETS REVOLVE AROUND THE SUN .. THE EARTH SPINS ON ITS OWN AXIS ... ఏక్సిస్ అంటే?

సైన్సు పుస్తకాలు అవతల పడేసి మేథ్స్ తీశాడు వాడు.

THE SIDE OF A SQUARE IS TWICE AS LONG AS THE SIDE OF ANOTHER SQUARE, HOW MANY TIMES IS THE PERIMETER OF THE FIRST SQUARE TO THE PERIMETER OF THE SECOND SQUARE?

The side of a square. Perimeter of the second square. ... ఈ చదువు నేను చదవలేను. నా కేవీ అర్థం కాదు. స్కూల్లో టీచరు కొడుతుంది. ఇంట్లో నాన్న తిడతాడు. ఈసారి నాన్న తిడితే ... పారిపోను, చచ్చి పోతాను ... నాకు చచ్చిపోవాలనుంది.

I WANT TO DYE - హోం వర్కు చెయ్యడానికి తీసిన నోటు బుక్కు మీద పరధ్యానంగా తన మనసులో అనుకున్నది రాశాడు ఏడుస్తూనే.

అలా ఏడ్చి ఏడ్చి నిద్రపోయిన వాడికి అయిదవుతుండగా మెలకువ వచ్చింది. నిద్రపోయిన తరువాత వాడి మనసు ప్రశాంతంగా ఉంది. కొంచెం తిక్క తగ్గింది. చాలా ఆకలి అనిపించి టేబులు మీద అమ్మ పెట్టిన టిఫిను తిని, పాలు తాగి, కిటికీలోంచి కింద ఆడుకుంటున్న పిల్లలకేసి చూడసాగాడు. వాళ్లు నవ్వుతూ, తుళ్లుతూ ఒక్కళ్ల నొకళ్లు తోసుకుంటూ పడిపోయి లేస్తూ ఆడుకుంటుంటే వాడికీ సరదా అనిపించింది.

కిటికీ ఎక్కి ఊచలు పట్టుకు ఊగుతూ ఆటలు చూస్తుండగా కాలింగ్ బెల్ మోగింది.

"అమ్మ వచ్చేసింది" అని కిటికీలోంచి దూకి పరుగున వెళ్లి తలుపు తీశాడు.

"టిఫిను తిన్నావా?" అని అడగబోతూ గదంతా చూసింది విమల. ఓ వేపు పుస్తకాల బాగ్, ఓ వేపు వాటర్ బాటిలూ - గదంతా చిందరవందరగా కనిపించింది.

"ఇల్లంతా అలా చేసేవిటి చిన్నా - నీట్‌గా ఉంచుకోవద్దూ," అని గది సర్దడం మొదలుపెట్టింది.

"అమ్మా! కొంచెంసేపు ఆడుకోనా?" రాంబాబు మెల్లిగా తల్లి పక్క చేరి అడిగాడు.

'హోం వర్కు అయిపోయిందా?'

'వచ్చాక చేస్తా.'

'వెళ్లు - కాని త్వరగా వచ్చేయ్! బట్టలు మాపుకోకు' - తల్లి పెర్మిషన్ ఇవ్వగానే వాడు ఛంగున బయటికి దూకి వెళ్లిపోయాడు.

ప్రభాకర్ రాత్రి ఎనిమిదవుతుండగా సుడిగాలిలా వచ్చాడు. వస్తూనే విసురుగా - 'ఏడీ వీడు?' అనరిచాడు.

'ఏం? అవతల గదిలో టీ.వీ. చూస్తున్నాడు.'

"పిలూ వాణ్ణి - వీడి మూలాన ఎన్ని మాటలు పడాల్సివచ్చిందో తెలుసా? వాడి ప్రిన్సిపాల్ ఆఫీసుకు ఫోను చేసి, వాణ్ణి మనం సరిగ్గా చదివించటం లేదని ఛడామడా తిట్టింది. వాడు ఇంప్రూవ్ కాకపోతే టీసీ ఇచ్చి పంపించేస్తానంది. ఛ ... ఛ ... వీడేదో బాగుపడతాడని, వాళ్లనీ వీళ్లనీ పట్టుకుని రెండు వేలు డొనేషన్ కట్టి మంచి స్కూల్లో చేర్పిస్తే ఈ వెధవకి ..." తండ్రి మాటలు వినిపించి హాల్లోకి వచ్చిన రాంబాబుని చూస్తూ కళ్లెర్రజేసి అడిగాడు ప్రభాకర్ - 'నీ ప్రోగ్రెస్ కార్డు ఏదీ?' ఆటల్లో, టీ.వీ.లో పడి మర్చిపోయిన స్కూలు కళ్లముందు మెదిలి కన్నీళ్లు తిరిగాయి రాంబాబుకి, వాడి మొహం పాలిపోయింది.

'బాగ్‌లో ఉంది...' అన్నాడు సణుగుతున్నట్లు. తండ్రి ఏమంటాడో అని కంగారుతోనూ, భయంతోనూ వాడి గుండె వేగంగా కొట్టుకోసాగింది. '...32వ ర్యాంకు' - ప్రభాకర్ ప్రోగ్రెస్ కార్డు విసిరి నేలకేసి కొట్టాడు. కుర్రాడు ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు.

"మొదటి అయిదుగురిలోనూ ఉండాలని చెప్పానా? ఏ రోజు పాఠాలు ఆ రోజు చదవాలని చెప్పానా?"

రాంబాబు భయం భయంగా తలూపాడు.

'తలూపడం కాదు - నోటితో చెప్పు.'

'చెప్పారు.'

'చదువుతున్నావా?'

'చదువుతున్నాను.'

'ఈవేళ హోంవర్కు చేశావా?'

'ఇంకా చెయ్యలేదు?'

'ఎందుకు చెయ్యలేదు?'

'... ...'

'నీ నోట్సేవీ?' - ప్రభాకర్ ఇల్లెగిరిపోయేలా అరిచాడు. రాంబాబు వణుకుతూ నోటు బుక్స్ అందించాడు. ప్రభాకర్ నోట్ బుక్స్ తిరగేస్తుంటే - 'I want to dye' అని కనిపించింది.

'డై స్పెల్లింగేమిటి?' - ప్రభాకర్‌కి ఆ వాక్యంలో స్పెల్లింగ్ మిస్టేకే కనిపించింది కాని, అసలు కొడుకు నోటుబుక్కులో అలా ఎందుకు రాశాడనే ఆలోచన రాలేదు.

'.. ..' రాంబాబు మళ్లీ వణికాడు కాని పెదవి విప్పలేదు.

'చెప్పు' - పళ్లు నూరుతూ మళ్లా అరిచాడు ప్రభాకర్.

'డి..వై..యి..'

'నీ తలకాయ - డి..ఐ..ఇ.. పందసార్లు ఇంపొజిషన్ రాసి చూపించు..'

గజగజా వణుకుతున్న కొడుకుని చూస్తే విమలకి జాలి వేసింది. వాణ్ణి దగ్గరకు చేర్చుకుని, బుజ్జగించి ఓదార్చాలనిపించింది. కాని ప్రభాకర్ కోప్పడుతున్నప్పుడు అలా జాలి చూపించడం కుర్రాడికి లోకువైపోవడం అనుకుని మాట మారుస్తూ - "వచ్చీ రాగానే ఇంకా కాళ్లూ, చేతులూ కడుక్కోకుండా ఏవిటీ - తీరిగ్గా అడుగుదురు గాని లెండి..." అంది విమల భర్తని శాంతింపచెయ్యడానికి ప్రయత్నిస్తూ.

ప్రభాకర్ విసురుగా లోపలికి వెళ్లాడు.

భోంచేస్తున్నప్పుడు కూడా ప్రిన్సిపాల్ మాటలే గుర్తుకొచ్చి అతని గుండె కుతకుతలాడింది. - "ఏవిటి ఈ బోడి స్కూల్లో చెప్పేది - వీళ్లు చెప్పేది చదువు కాదు - ఇదో రేకెట్ - పందల ఫీజులు కట్టడం రో జుకు నాలుగు గంటలు విమలా, నేనూ వాడిచేత హోం వర్కు చేయించడం... అయినా వీడి హోంవర్కు మేం చేయించడమేమిటి? హు ... వాడే చేసుకోవాలి కాని ... ఛ ... ఛ ... మట్టిబుర్ర వెధవ..." ఆ కోపం కొడుకు మీదికి వెళ్లింది. ఒకటి రెండుసార్లు మరి కోపం పట్టలేక మాట్లాడబోయాడు కాని, భోంచేస్తుంటే ఈ విషయం ఎత్తవద్దని విమల కళ్లతోనే వారించింది.

రాంబాబు మాట్లాడకుండా - తల్లి కేసి కాని, తండ్రి కేసి కాని చూడకుండా - తల వంచుకునే భోంచేయసాగాడు. వాడికి అన్నం సయించడం లేదు. తుపాను ఇంకా తగ్గలేదనీ, మళ్లీ విరుచుకుపడుతుందనీ వాడికి తెలుసు. భోజనాలు అయిపోయిన తరువాత, తండ్రి గదిలో అటూ ఇటూ పచార్లు చేస్తూ తనకేసి అప్పుడప్పుడు చూస్తూంటే, ఆ కళ్లల్లో కళ్లు కలపకుండా పక్కకి తప్పిస్తూ, ఎప్పుడు ఈ అగ్నిపర్వతం పేలుతుందా అని దడదడలాడే గుండెలతో క్షణాలు లెక్కపెడుతూ కుర్చీ అంచున ఊపిరి బిగబట్టి కూర్చుని ఎదురుచూస్తున్నాడు వాడు.

"మార్కులు ఎందుకు తక్కువ వచ్చాయి?" - ప్రభాకర్ పచార్లు చెయ్యడం ఆపి రాంబాబు ఎదురుగా నిలబడి సాధ్యమైనంత మెల్లగా అడిగాడు - అయిదు నిమిషాల తరువాత. అప్పటికి తొమ్మిదిన్నరయింది. విమల కూడా పని ముగించుకువచ్చి అక్కడే కూర్చుంది.

హఠాత్తుగా తండ్రి తన ఎదురుగా ఆగి అలా అడగడంతో వాడు తడబడ్డాడు. చేతులు నెర్వస్‌గా నలుపుతూ తల్లికేసి ఓ సారి చూసి, తల్లి కలుగజేసుకోకపోవడంతో ఏడుపుగొంతుతో 'తెలియదు' అన్నాడు.

'బాగా రాశావా?'

'బాగానే రాశాను.'

'బాగా రాసినా నీకు మార్కులు ఇవ్వలేదా?'

'... ...'

'అసలు నీకు పాఠాలు అర్థమవుతున్నాయా?' విమల అడిగింది.

"మిగిలిన పిల్లలందరికీ అర్థమైనప్పుడు వీడికెందుకు కాదు - చవటన్నర చవట ... ఛ... ఛ..." - ప్రభాకర్ ఆగ్రహం మళ్లీ తారాస్థాయికి చేరుకుంది - "నిన్నేదో ఉద్ధరిద్దామని, చాలా బాగా చదివిద్దామని ఇంత తగలేస్తున్నాను. మాకు అవకాశాల్లేకా, సరియైన చదువులు లేకా - అన్నింటిలోనూ తక్కువైన అణాకానీ వెధవలందరికీ 'సార్', 'సార్' అని సలాంలు కొడుతూ ఇలాంటి ఉద్యోగాల్లో రాట్ అవుతున్నాం. నీకు ఇలాంటి పరిస్థితి రాకూడదని ఎంతో జాగ్రత్తగా చదివిద్దామనుకుంటే నీ కర్మ ఇలా తగలడుతోంది. అమ్మా, నేనూ సంపాదిస్తుంటే ఇంట్లో స్కూటరూ, టీవీ, ఫ్రిజ్, ఇవన్నీ కనిపిస్తున్నాయి కాని, ఈడ్చి తంతే చిల్లిగానీ లేదు తెలుసా? మెరిట్లో వస్తే రావడం - లేకపోతే అడుక్కు

తినడానికి కూడా పనికి రాకుండా పోతావు ..." జీవితంలో తనకు ఎదురైన ఫ్రస్టేషన్ అంతా కొడుకు మీద చూపించాడు ప్రభాకర్.

తండ్రి మాట్లాడుతున్న దేమిటో అర్థంకాక ఎప్పుడు ఈ అగ్నిపరీక్ష అయిపోతుందా అన్నట్లు ముళ్లమీద కూర్చున్నట్లు కూర్చున్నాడు రాంబాబు.

అలా తన ఆవేశానికి ఒక రూపమిచ్చిన తరువాత కొంచెం శాంతించి తన గదిలోకి వెళ్లి సిగరెట్టు కాల్చుకోసాగాడు ప్రభాకర్.

విమల రాంబాబు పక్క సర్ది, వాడిని పడుకోమని చెప్పి పడకగదిలోకి వెళ్లబోతుంటే వాడు 'అమ్మా!' అని కొంగుపట్టి లాగి, తండ్రికి వినబడకుండా మెల్లిగా అన్నాడు - 'ఇవాళ నా దగ్గర పడుకుంటావా?'

వాడికి స్కూల్లో జరిగిన అవమానం, తండ్రి వేసిన కేకలూ - అన్నీ తల్లి ఒడిలో మర్చిపోయి ఓదార్పు పొందాలని వుంది. తల్లిమీద చేతులు వేసుకుని, తల్లి ఒడిలో ఒదిగిపోయి పడుకుని తన దుఃఖాన్ని మరిచిపోవాలని వుంది.

'సరే!' అంది విమల వాడి పక్కనే పడుకుంటూ. వాడికి కొండంత సంతోషం కలిగింది. తల్లిమీద ఒక కాలూ, ఒక చెయ్యీ వేసుకుని, గట్టిగా కౌగిలించుకుని పడుకున్నాడు. విమల వాడి తల నిమురుతూ చెప్పసాగింది. - "చూడు నాన్నా! నాన్నగారు నువ్వు బాగుపడాలనే కోప్పడతారు కాని, నువ్వంటే ప్రేమ లేక కాదు. నీకు ఎన్ని బొమ్మలు, పుస్తకాలు కొనివ్వలేదూ - ఇచ్చారా?"

తల్లి ఓదార్పుకోసం ఆశగా ఎదురుచూస్తున్న వాడికి తల్లి ఆ రకంగా మాట్లాడడం దుఃఖాన్ని కలిగించింది. తల్లిమీంచి కాలూ, చెయ్యీ తీసేసి కొంచెం దూరంగా జరిగాడు. ఆ సంగతి గమనించని విమల చెప్పసాగింది. - "రోజూ పాఠాలు శ్రద్ధగా చదువుకో! స్కూల్లో టీచరు చెప్పేది శ్రద్ధగా వినాలి. మంచి ట్యూటర్ని చూసి ట్యూషన్ పెట్టిస్తా. స్కూల్లో పాఠాలు అర్థం కాకపోతే సాయంత్రం ట్యూటర్ని నాలుగుసార్లు అడిగి చెప్పించుకో. నువ్వు బాగా చదవాలి. చదువుకుని పైకి రావాలి. అదే మా కోరిక - చదువుకుంటావా?"

పైకి రావడమంటే ఏమిటో నాకు తెలియదు కాని, నాకు అంతా తెలుసుకోవాలని ఉంటుంది. నాకు ఈ ప్రపంచం చాలా వింతగా, తమాషాగా, ఆసక్తికరంగా కనిపిస్తుంది. నిన్న వేసిన విత్తనంలోంచి ఈ రోజు మొక్క వస్తే నాకు చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. నాకు

నక్షత్రాలూ, కార్లూ, స్కూటర్లూ, విమానాలూ, రాకెట్లూ - అన్నింటి గురించి తెలుసుకోవాలనిపిస్తుంది. అంతేకాదు - పక్కింటి శాంతక్క చందమామ చదివి కథలు చెబుతుంటే నాకు ఎంతో ఇష్టంగా ఉంటుంది. నాకూ అలాంటి కథలు తిరిగి చెప్పాలనిపిస్తుంది. సాయంత్రం వేళల్లో పిల్లలందరూ వీధుల్లో గోలచేస్తూ, గాలిపటాలెగరేస్తూ, బంతాట, క్రికెట్టూ ఆడుతుంటే నాకూ వాళ్లలో కలిసిపోయి పిచ్చిగా ఆడుకోవాలనిపిస్తుంది కాని, ఇంట్లో ఒంటరిగా గంటల తరబడి హోంవర్కు చేస్తూ కూర్చోవాలనిపించదు. చదువుకుని అన్నీ తెలుసుకోవాలన్న ఆసక్తి వుంది కాని, నేను పాఠాలు అప్పచెప్పే టేప్ రికార్డరుగా, ప్రశ్నలకు సరియైన సమాధానాలు ఆన్సరు పేపరులో దించే ఫోటో కాపియర్లా ఉండలేను. చదువు పేరుతో నా చిన్న చిన్న కోరికలూ, ఆనందాలూ అన్నింటినీ నలిపేసి, నా పసితనం నాకు దూరం చేసి నన్నొక మార్కులు స్కోరు చేసే కంప్యూటరుగా మార్చెయ్యకండి - అని తన మనసులో తనకే అర్థం కాకుండా గందరగోళంగా మెదులుతున్న భావాలకు ఓ రూపం కలిపించి తల్లికి చెప్పడానికి వాడికి వయసూ లేదు, భాషా రాదు. పెదవి విప్పితే వచ్చేది ఏడుపే.

అందుచేత పెదవి బిగబట్టి ఏడుపు ఆపుకుంటూ 'ఊ..' అన్నాడు వాడు తల్లి ప్రశ్నకు సమాధానంగా. తల్లి తన పక్కన పడుకున్నందుకు కలిగిన ఆనందం మాయమైపోయింది. తల్లి స్పర్శ వాడికి ఓదార్పునివ్వడం లేదు. మంచం మీద తన పక్క తల్లి ఉనికిని కూడా వాడు సహించలేకపోయాడు.

"నే ఒక్కణ్ణే పడుకుంటా! నువ్వెళ్లిపో - ఆ గదిలో పడుకో!" అన్నాడు.

"ఏం - నీ దగ్గరే పడుకోమన్నావు కదరా! కోపం వచ్చిందా?" అంది విమల. '... ...'

"నీ ఇష్టం - మరి గుడ్ నైట్ చెప్పు," అంది విమల వాడి బుగ్గమీద ముద్దు పెట్టుకుంటూ.

'గుడ్ నైట్!' అన్నాడు వాడు తల్లికి తిరిగి ముద్దు ఇస్తూ. ఆ ముద్దులో ఆప్యాయత లేదు.

విమల దుప్పటి కప్పి, లైటార్పి పడక గదిలోకి వెళ్లి తలుపు దగ్గర వేసి ప్రభాకర్‌తో అంది - "వాడు ఎంత బెదిరిపోయాడో చూడండి.

వాడు మాత్రం ఏం చేస్తాడు? చదువుతున్నాడు కదా! వాడు బిలో ఏవరేజ్ - కె.జి. నుంచి ఆ విషయం స్పష్టంగా తెలుస్తూనే వుంది. వాడు ఇంగ్లీషు మీడియంలో లెసన్సు ఫాలో కాలేకపోతున్నాడు. అందరి తెలివితేటలూ ఒకేలా ఉండవు. కొంతమంది ఒకసారి చెప్పగానే అందుకుపోతారు. కొంతమందికి పదిసార్లు చెప్పాలి. అయినా స్కూలు జీవితంలో ఓ భాగం కాని అదే జీవితం కాదు. స్కూలు రికార్డు బ్రిలియంటుగా ఉన్నవాళ్లు ఎంతమంది ఫ్లాప్ అవలేదూ? స్కూల్లో ఏవరేజ్‌గా ఉన్నవాళ్లు ఎంతమంది ఎన్ని రంగాల్లో వెలగడంలేదు? వీడిలో ఏ ఆర్టిస్టు, సైంటిస్టు ఉన్నాడో - ఎవరు చెప్పగలరు? మెరిట్లో రావాలని వాడిని మీరు తిట్టినా, కొట్టినా నెర్వెస్ రెక్‌గా తయారవుతాడు కాని ఫస్టు....రా..గ..ల..డా?" విమలకి కూడా ఏడుపొచ్చినంత పనైంది.

ప్రభాకర్ ఏమీ సమాధానం చెప్పలేదు. అతనికీ ఆ విషయం తెలుసు. విద్య ,పరమార్థం విజ్ఞానమే అయితే, దానికి ఈ ఉరుకులూ, పరుగులూ అక్కర్లేదు. వాడికి తగిన విధంగా మెల్లిగా నేర్చుకుంటాడు. ఏదో ఒక రంగంలో తన ప్రతిభ చూపిస్తాడు.

కానీ...

వాడికి ఈ చదువు బతుకుతెరువు. వాడు రేపటి పౌరుడు. వాడి జీవితం ఓ పరుగుపందెం. పరుగు ఆపినవాడు వెనుకబడిపోతాడు. వెనుకబడ్డవాడు నాశనమైపోతాడు. వాడు అలిసిపోతున్నాడని తల్లీ తండ్రీ జాలి జూపించినా రేపు లోకం జాలి చూపించదు. నిర్దాక్షిణ్యంగా తన కాళ్లక్రింద తొక్కేసి వెళ్లిపోతుంది. వాడు అడుగడుగునా - స్కూల్లో, కాలేజీలో, యూనివర్సిటీలో, ఉద్యోగాల్లో - కాంపిటీషన్‌కి తట్టుకు నిలబడాలంటే ఇష్టమైనా, కష్టమైనా ఈ రేట్ రేస్‌కీ, ఈ ఆశాభంగాలకీ ఇప్పట్నుంచే అలవాటు పడాలి.

కాని ... సహజంగా నెమ్మదిగా వికసించాల్సిన మొగ్గని తొందరజేస్తే ఏమవుతుంది?

ప్రభాకర్‌కి మనసంతా చికాకుగా ఉంది. కొడుకు భవిష్యత్తు గురించి ఆందోళనగా ఉంది. "ఇంకా పదేళ్లు నిండలేదు - విమల చెప్పేది కూడా నిజమే - రేపు ఏ రంగంలో వాడు రాణిస్తాడో - నేను అనవసరంగా వర్రీ అవుతూ వాడిని చదువు పేరుతో హింసిస్తున్నానేమో!" అన్న ఆలోచన మరో ప్రక్క వేధిస్తోంది.

"కుర్రాడు చాలా స్ట్రెయిన్ ఫీలవుతున్నాడు. పోనీ స్కూలు మార్పించి తెలుగు మీడియంలో వేస్తే ... స్కూలు మార్చినంత మాత్రాన అసలు సమస్య - కాంపిటీషన్ ఎక్కడికి పోతుంది?" - అతని కేమీ పాలుపోలేదు.

ఆలోచిస్తూ మళ్లీ కొడుకు గదిలోకి వెళ్లి వాడి మంచం దగ్గర నిలబడి అమాయకంగా నిద్రపోతున్న వాడికేసి రెండు నిమిషాలు దీక్షగా చూస్తూ నిలబడ్డాడు. అలా చూస్తుంటే అతనిలో జాలీ, ప్రేమా పొంగుకొచ్చాయి. అతను ముందుకు వంగి కుర్రాడి బుగ్గమీద ముద్దు పెట్టుకుని పడకగదిలోకి వెళ్లాడు.

అంతవరకు నిద్రపోయినట్లు నటిస్తున్న రాంబాబు - తండ్రి వెళ్లిపోయాక ఒక్కసారి తేలిగ్గా ఊపిరి పీల్చాడు. మరో నిముషం తరువాత పక్క గదిలో లైటు ఆరిపోయింది.

అప్పుడు -- ఆ చీకటిలో, ఏకాంతంలో వాడి దుఃఖం కట్టలు తెంచుకుని పొంగింది. దుప్పటి ముసుగు పెట్టి, శబ్దం పైకి రాకుండా వెక్కి వెక్కి ఏడవసాగాడు. "నేను చవటని - నాకు చదివిందేమీ గుర్తుండదు. మార్కులు రావు - నేనేం చెయ్యను?" - వాడిని వాడే అమాయకంగా ప్రశ్నించుకుంటూ, సమాధానాలు చెప్పుకుంటూ నిద్రలోకి జారిపోయాడు.

ఆ నిద్రలో కూడా కలతలు ... భయాలు ... కొంచెం మెరుపులా ఆనందపు వెలుగులు ... స్కూలు ... టీచర్ ... ట్రిణ్ ట్రిణ్ ట్రిణ్ ... ఓపెన్ యువర్ బుక్స్ ... రీడ్ లెసన్ ... రీడ్ లెసన్ నంబర్ ఫైవ్ ... నా పెన్సిలిస్తా, గోళీలిస్తావా ... WHAT IS PHOTO-SYNTHESIS ... స్టాండప్ ఆన్ ది బెంచ్ ... చిరంజీవి మా అన్నరోయ్! అణ్ణేవన్నా అంటే మక్కెలిరగదంతా ... డిషుం ... డిషుం ... WHEN WE MULTIPLY THE NUMERATOR ... పిపీప్ ... బస్సు స్టార్టయి పోతోందిరోయ్ ... ఎక్కేవాళ్లు ఎక్కొచ్చు... పిపీప్ ... ఏలూరు, నిడదవోలూ, రాజమండ్రీ. పిపీప్ ... THE GREEN COLOURING MATTER WHICH IS PRESENT IN THE ... స్టాండప్ ఆన్ ది బెంచ్ ... శాంతక్కా! రాక్షసులకి నిజంగానే కొమ్ములు, కోరలూ ఉంటాయా ... TO COMPARE A MIXED NUMERAL WITH AN IMPROPER FRACTION ... నా కేమీ అర్థం కావడం లేదు ... కె. రాంబాబు ... లాస్ట్ రేంక్ ... స్టాండప్ ఆన్ ది బెంచ్ ... నీ ప్రోగ్రెస్ కార్డు ఏదీ ... నేను పారిపోతాను.. నీ ప్రోగ్రెసు.. నాకు చచ్చిపోవాలని

పుంది... ఐ వాంట్ టు డై... డీ... ఐ..ఇ.. డై.. డీ... ఐ... ఇ... డై... డీ.. ఐ... ఇ... డై... డీ... వై..

'చిన్నా ! లే అమ్మా! ఆరైపోతూంది.'

కలత నిద్రలో ఉన్న ఎనిమిదేళ్ల రాంబాబుకి తల్లి మాటలు ఎక్కడో నూతిలోంచి వస్తున్నట్లు వినబడ్డాయి కాని మెలకువ రాలేదు. వాడు కళ్లు తెరవడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆలిచిప్పల్లాంటి వాడి కనురెప్పలు కొద్దిగా కదిలాయి కాని...

*(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 31-10-1990, సౌజన్యంతో...)*

❀ ❀ ❀